జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 17 | జులై | 2026 ◆ పేజీలు : 5

## విద్యానగర్‌లో అర్ధరాత్రి గ్యాంగ్ బీభత్సం

**కారు అద్దాలు ధ్వంసం.. యువకుడిని బైక్‌పై తీసుకెళ్లి దాడి**

**చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు**





**కొత్తగూడెం టౌన్, జులై 16 (ప్రజా జ్యోతి)** చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న దాడి ఘటన స్థానికంగా కలకలం రేపింది. కారులో కూర్చొని మాట్లాడుకుంటున్న ఇద్దరు యువకులపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి కారును ధ్వంసం చేయడంతో పాటు వారిలో ఒకరిని బలవంతంగా బైక్‌పై తీసుకెళ్లి కర్రలు

మిగతా 2 లో...




# సింగరేణిలో నేడు మెడికల్ బోర్డు.. కార్మికులకు ఊరట దక్కేనా..?

- దీర్ఘ విరామం తర్వాత మళ్లీ ప్రారంభం కానున్న మెడికల్ బోర్డు
- కార్మిక కుటుంబాల్లో ఉద్యోగాలపై మరోసారి ఆశలు
- గత అనుభవాల నేపథ్యంలో మెడికల్ బోర్డు తీరుపై ఉత్కంఠ
- అన్‌ఫిట్ శాతంపైనే కార్మికుల్లో ఆసక్తి
- వారసత్వ ఉద్యోగాల అంశం మళ్లీ తెరపైకి
- కార్మిక ప్రాంతాలపై రాజకీయ పార్టీల ఫోకస్
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇదో కీలక పరీక్షగా విశ్లేషణ
- నేటి మెడికల్ బోర్డు ప్రక్రియలో పాల్గొననున్న 120 మంది కార్మికులు

## ఆరో నిందితుడిపై మౌనం ఎందుకు..?




**పోక్సో కేసులో కానిస్టేబుల్ పాత్రపై పెరుగుతున్న సందేహాలు**

**పూర్తి వివరాలు ఎందుకు వెల్లడించలేదు..?**

**అరెస్టులో ఆలస్యం వెనుక అసలు కారణమేంటి..?**

**చట్టం ముందు అందరూ సమానమే కదా..?**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి | జూలై 16 | ప్రజా జ్యోతి** కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో పోలీసులు ఫిర్యాదు అందిన వెంటనే వేగంగా స్పందించి దర్యాప్తు ప్రారంభించారు. బాధితురాలి వాంగ్మూలం, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా తక్కువ సమయంలోనే నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం దర్యాప్తులో కీలక ముందడుగుగా చెప్పవచ్చు. అయితే అదే కేసులో ఎఫ్ఐఆర్‌లో ఆరో నిందితుడిగా పేర్కొన్న కానిస్టేబుల్ ఇప్పటికీ అరెస్టు కాకపోవడం, ఆయన పూర్తి వివరాలు వెల్లడించకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. 15వ తారీఖు నాడు పోలీసులు విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో మొదటి నలుగురు నిందితుల


మిగతా 5 లో...

## పాల్వంచలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఇద్దరు యువకులు మృతి**







2 లో...

## సీతారామ ప్రాజెక్టు మారేళ్ళపాడు ప్రాజెక్టును సందర్శించిన మంత్రులు ఎమ్మెల్యేలు

**గోదావరి జలాల ను వినియోగంలోకి తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం.**

**:ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క.**

**ప్రాజెక్టులు పనులను త్వరగా పూర్తిచేసి రైతులకు నీరు అందిస్తాం.**

**:మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**సీతారామ ప్రాజెక్టును నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేస్తాం.**

**:మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**మణుగూరు /అశ్వాపురం జులై 16, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం సీతమ్మ సాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారం మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షేత్రస్థాయిలో

మిగతా 2 లో...

## పాల్వంచలో ఘోర రోడ్డు ప్రమాదం

### ఇద్దరు యువకులు మృతి

**పాల్వంచ, జూలై 16, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని నవభారత్ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. విజయవాడ నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న బీసీఎం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుల వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. ఈ ఘటనతో నవభారత్ ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొనగా, పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించి రాకపోకలను పునరుద్ధరించారు.

## విద్యానగర్‌లో అర్ధరాత్రి గ్యాంగ్ బీభత్సం

(మొదటి పేజీ తరువాయి...)

రాళ్లతో దాడి చేసినట్లు బాధితులు ఆరోపించారు. బాధితుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసముంటున్న రాహుల్ బుధవారం కొత్తగూడెం వచ్చాడు. రాత్రి తన స్నేహితుడితో కలిసి విద్యానగర్‌లోని రామాంజనేయ కాలనీలో కారులో కూర్చొని మాట్లాడుకుంటుండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి రాహుల్ ఎవరో అడిగారు. ఈలోపే పదిమందికి పైగా గుర్తుతెలియని వ్యక్తులు అక్కడికి చేరుకుని కారును చుట్టుముట్టి అద్దాలను ధ్వంసం చేశారు. అనంతరం కారులో ఉన్న రాహుల్, అతని స్నేహితుడిని బయటకు లాగి దాడికి పాల్పడ్డారు. ఈ సమయంలో కుటుంబ సభ్యులు, స్థానికులు కేకలు వేయడంతో రాహుల్‌ను బలవంతంగా బైక్‌పై ఎక్కించుకుని గాంధీ కాలనీ వైపు తీసుకెళ్లినట్లు తెలిపారు. గాంధీ కాలనీలోని గ్యాస్ గోదాం సమీపంలో రాహుల్‌పై కర్రలు, రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన అనంతరం అక్కడే వదిలేసి వెళ్లిపోయినట్లు సమాచారం. రాహుల్ స్నేహితుడు ఇతర మిత్రుల సహాయంతో అక్కడికి చేరుకుని అతడిని రక్షించి తీసుకొచ్చినట్లు తెలిపాడు. రాహుల్ మాట్లాడుతూ తాను హైదరాబాద్‌లో ఉంటానని బుధవారం మాత్రమే కొత్తగూడెం వచ్చినట్లు పేర్కొన్నాడు. గతంలో జరిగిన చిన్నపాటి ఘర్షణను దృష్టిలో పెట్టుకుని తనపై ఈ దాడి జరిగినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. గాంధీ కాలనీకి చెందిన సుమారు పది మంది యువకులు ఈ దాడికి పాల్పడినట్లు ఆరోపించాడు. ఈ ఘటనపై చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రాహుల్ తెలిపాడు.

## మర్కోడులో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష

### ఆన్‌లైన్ నమోదు సుమారు 900 పైన పూర్తి చేసినట్లు బీఎల్ఓ పాయం విజయ వెల్లడి



**ఆళ్ళపల్లి. జులై16(ప్రజాజ్యోతి)** ఆళ్ళపల్లి మండలం లోని మర్కోడు పంచాయతీ కేంద్రంలో బీఎల్ఓగా విధులు నిర్వహిస్తున్న పాయం విజయను మండల తహసీల్దార్ గద్దం ఉమాదేవి, మర్కోడు గ్రామ సర్పంచ్ సుతారి రమాదేవి కలిసి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బీఎల్ఓ పాయం విజయ మాట్లాడుతూ, తన పరిధిలో మొత్తం 1,300 మంది ఓటర్లకు సంబంధించి ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టగా, అందులో ఇప్పటికే సుమారు 900 మందికి పైగా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన వారి నమోదు కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఓటర్లందరూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని, అవసరమైన పత్రాలను అందించి నమోదు పూర్తి చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సూచించారు.ఈ కార్యక్రమంలో మర్కోడు సర్పంచ్ సుతారి రమాదేవి, బీఎల్ఓ పాయం విజయ, కాంగ్రెస్ నాయకులు కోనేటి వీరభద్రాచారి, ఎస్.కే. పర్వీన్, జీపీఓ రమణ, కొరం పద్మ, కొమరం లక్ష్మి పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు మారేళ్ళపాడు ప్రాజెక్టును సందర్శించిన మంత్రులు ఎమ్మెల్యేలు







(మొదటి పేజీ తరువాయి...)

పరిశీలించారు. ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు మ్యాప్‌లు, సాంకేతిక నమూనాల ద్వారా బ్యారేజ్, పంప్‌హౌస్‌లు, కాలువలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థ, ఆయకట్టు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనులు, అవసరమైన నిధులు తదితర అంశాలను మంత్రులకు వివరించారు.

### గోదావరి జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని సాధ్యమైనంత మేర పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో గ్రావిటీ ద్వారా, అవసరమైన చోట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించేలా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో రాజీవ్ సాగర్ ప్రాజెక్టు రూ.1,640 కోట్లతో రెండు లక్షల ఎకరాలకు, ఇందిరా సాగర్ ప్రాజెక్టు రూ.1,680 కోట్లతో మరో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించబడినట్లు తెలిపారు. మొత్తం సుమారు రూ.3,500 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రణాళిక రూపొందించబడిందన్నారు. రాష్ట్ర విభజనకు ముందు ఈ రెండు ప్రాజెక్టులపై సుమారు రూ.2,000 కోట్ల వరకు వ్యయం జరిగిందని, మిగిలిన పనులకు సుమారు రూ.1,505 కోట్లు అవసరమయ్యే పరిస్థితి ఉండేదన్నారు. అనంతర కాలంలో ప్రాజెక్టు పునఃరూపకల్పనతో అంచనా వ్యయం సుమారు రూ.24 వేల కోట్లకు పెరిగిందని, ఇప్పటికే రూ.7,500–8,000 కోట్ల వరకు వ్యయం జరిగినట్లు వివరించారు. ప్రస్తుతం భారీ ప్రజాధనం ఇప్పటికే వ్యయమైనందున మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీతమ్మసాగర్, సీతారామ, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థలను సమన్వయం చేసి గోదావరి జలాలను గరిష్టంగా వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నెలా పనుల పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన నిధులు విడుదల చేసి ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు .

### సీతారామ ప్రాజెక్టును నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

రాష్ట్ర నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు అని అన్నారు . ఇప్పటికే ప్రాజెక్టుపై గణనీయమైన ప్రజాధనం వ్యయమైనందున మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ రంగంపై గతంలో సుమారు రూ.1.81 లక్షల కోట్లకు పైగా వ్యయం జరిగినప్పటికీ అనేక ప్రాజెక్టులు ఇంకా వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై సుమారు రూ.27,500 కోట్లు వ్యయం జరిగినట్లు తెలిపారు . ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించి జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (NDSA), కేంద్ర జల సంఘం (CWC) సూచనల మేరకు సాంకేతిక పరీక్షలు, భూగర్భ పరిశీలనలు, నిర్మాణ భద్రతా అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. నిపుణుల నివేదికల ఆధారంగా అవసరమైన పునరుద్ధరణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు . ప్రజల భద్రత, నిర్మాణ నాణ్యత, నీటి నిల్వ సామర్థ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని నిర్ణయాలు శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగానే తీసుకుంటున్నామని వివరించారు. సీతారామ ప్రాజెక్టులోని పంప్‌హౌస్‌లు, బ్యారేజ్, కాలువలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థల నిర్మాణాన్ని వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలలో రికార్డు స్థాయిలో వరి ధాన్యం పండించి రైతుల ఖాతాల్లో రూ.80 వేల కోట్లకు పైగా రైతులకు నేరుగా జమ చేసినట్లు తెలిపారు . ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలో ముందంజలో నిలిచిందన్నారు. సీతమ్మసాగర్–సీతారామ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ పై ఉన్న న్యాయపరమైన చిక్కులను పరిష్కరించుకొని త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చూస్తామన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసి జిల్లాలో గోదావరి జలాలను వినియోగించే విధంగా అదేవిధంగా ఇల్లందు నియోజకవర్గంలో కూడా నీరు అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

### ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందిస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను ప్రత్యక్షంగా పరిశీలించి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుకు అవసరమైన ఎలక్ట్రికల్, మెకానికల్ తదితర పనుల కోసం సుమారు రూ.1,000 కోట్లకు పైగా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు . గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోకుండా పంపింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి నీటి వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని పనులను వేగవంతం చేస్తున్నామని, అవసరమైన చోట అదనపు నిధులు కూడా విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని అన్నారు . జిల్లా కలెక్టర్ అంకిత్★ ప్రాజెక్టు పనుల ప్రస్తుత పురోగతి, భూసేకరణ, పునరావాసం, విద్యుత్ అనుసంధానం, అనుబంధ మౌలిక సదుపాయాల కల్పన, శాఖల మధ్య సమన్వయంపై మంత్రులకు వివరించారు. ప్రాజెక్టు పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులు, భూ సంబంధిత అంశాలను వేగవంతంగా పరిష్కరిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై జిల్లా స్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, శాఖల సమన్వయంతో పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమం అనంతరం మంత్రులు మారెళ్ళపాడు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, నీటిపారుదల శాఖ అధికారులు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు నీళ్లు భద్రాద్రి రైతులకే ఇవ్వాలి

- బిఆర్ ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతా రావు



**చర్ల, జూలై 16(ప్రజా జ్యోతి):** సీతారామ ప్రాజెక్టు నీటిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకే వినియోగించా లని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా మంత్రులు సీతా రామ ప్రాజెక్టు నీటిని ఖమ్మం జిల్లాకు తరలించే ప్రణాళికలు రూపొందిస్తున్నారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో అశ్వాపురంలో ప్రాజెక్టును సందర్శించేందుకు వస్తున్న నలుగురు మంత్రులకు రైతుల తరపున శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి మణుగూరు బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం హరిస్తోందని, ప్రశ్నించే ప్రజల గొంతును పోలీసుల ద్వారా అణచివేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజలకు నష్టం చేసే ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఇప్పటికైనా సీతారామ ప్రాజెక్టు నీటిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకే వినియోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు.

## హక్కుల కోసం ప్రశ్నిస్తే అర్ధరాత్రి అరెస్టులా?

- టేకులపల్లి పోలీసుల తీరుపై సేవాలాల్ సేన ఆగ్రహం



**టేకులపల్లి,జూలై 16,ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ శాంతియుత నిరసనకు సిద్ధమైన గిరిజన, బహుజన నాయకులను టేకులపల్లి పోలీసులు అర్ధరాత్రి ముందస్తుగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని సేవాలాల్ సేన ఆరోపించింది. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య రవి రాథోడ్, జిల్లా అధికార ప్రతినిధి బానోత్ నాగరాజు నాయక్, జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్‌నాయక్, నాయకుడు నరేష్‌నాయక్ లను అక్రమంగా అరెస్టు చేశారని పేర్కొంది. ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన భూ కుంభకోణం ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజల ముందుకు వచ్చి నిజానిజాలు వెల్లడించాలని, లేకుంటే నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. సీతారామ ప్రాజెక్టు నీటి పంపిణీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపై వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచలేరని హెచ్చరించింది. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని సేవాలాల్ సేన డిమాండ్ చేసింది.

## మర్కోడు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఉమాదేవి





**ఆళ్ళపల్లి,జూలై16(ప్రజాజ్యోతి)**ఆళ్ళపల్లి మండలంలోని మర్కోడు ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలను మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ) గద్దం ఉమాదేవి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, వంటల నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. భోజనంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఇలాంటి లోపాలు మరోసారి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వంట సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలో మర్కోడు సర్పంచ్ సుతారి రమాదేవి, బీఎల్వో విజయ, కాంగ్రెస్ నాయకుడు కోనేటి వీరభద్రాచారి, జీపీఓ రమణ, పాపారావు, ఎస్కే పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరుబయట నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ

- హెల్మెట్లు ధరించి బైక్ పై వచ్చిన ముగ్గురు దుండగుల దుశ్చర్య
- ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**టేకులపల్లి,జూలై16, ప్రజాజ్యోతి:** మండల పరిధిలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్ గ్రామంలో ఆరుబయట నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి సుమా రు మూడున్నర తులాల బంగారు గొ లుసును గుర్తు తెలియని దుండగులు అపహరించుకెళ్లిన ఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన భానోత్ భద్రు సుజాత దంపతులు బుధవారం రాత్రి ఇంటి బయట నిద్రించారు. గురువా రం తెల్లవారుజామున హెల్మెట్లు ధరించిన ముగ్గురు వ్యక్తులు బైక్ పై అక్కడికి వచ్చి, నిద్రలో ఉన్న సుజాత మెడలో ని సుమారు మూడున్నర తులాల బంగా రు గొలుసును చాకచక్యంగా అపహరించి పరారయ్యారు.ఈ ఘటనపై బా ధితులు పోలీసులకు ఫిర్యాదుచేయగా, టే కులపల్లి ఎస్ ఐ తిరుపతి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## వాన కోసం వరుణుడికి మొక్కులు.. రోళ్లపాడులో కప్పలకు పెళ్లి

- సమృద్ధిగా వర్షాలు కురవాలని గ్రామస్తుల ప్రత్యేక పూజలు



**టేకులపల్లి, జూలై 16,ప్రజాజ్యోతి:** మండలంలోని రోళ్లపాడు గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ గురువారం గ్రామస్తులు సంప్రదాయ పద్ధతిలో కప్పలకు పెళ్లి నిర్వహించి వరుణ దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. రోహిణి కార్తె నుంచి ఆరుద్ర కార్తె వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు సంప్రదాయ ఆచారాలను నిర్వహించారు.మహిళలు బంకమట్టితో వేదిక ఏర్పాటు చేసి, బిందెల్లో నీరు నింపి "వానమ్మా.. వానమ్మా.. ఒక్కసారి వచ్చిపోవా" అంటూ ఆటపాటలతో వరుణ దేవుడిని వేడుకున్నారు. కప్పలను వేపాకులపై ఉంచి పసుపు, కుంకుమలతో అలంకరించి ఇంటింటికీ ఊరేగింపుగా తీసుకెళ్లి వాటిపై నీళ్లు పోస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించా రు.వర్షాభావం తొలగి చెరువులు, కుంటలు నిండి పంటలు సమృద్ధిగా పండాలని గ్రామస్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

- ప్రతి అర్హ్వత కలిగిన ఓటరు ఫారాలు తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచన





**ఆళ్ళపల్లి.జూలై16(ప్రజా జ్యోతి)**ఆళ్ళపల్లి మండలంలోని ముత్తాపురం, అనంతోగు, రాయపాడు, ఆళ్లపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మండల బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత బూత్ లెవల్ అధికారులను (బీఎల్ఓలు) కలిసి కార్యక్రమం అమలు తీరుపై వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు.ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఎస్ఐఆర్ ఫారాలు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని, ఫారం నింపడంలో అవగాహన లేని ఓటర్లకు బీఎల్ఓలు ప్రత్యేకంగా సహకరించాలని సూచించారు. అలాగే ప్రతి ఓటరు ఫారాన్ని పూర్తిగా నింపి నిర్ణీత గడువులోపు బీఎల్ఓలకు అందజేయాలని, లేకపోతే ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ పరిశీలనలో ఎస్ఐఆర్ ప్రోగ్రాం ఇన్‌చార్జి, మాజీ గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, ఉపసర్పంచులు నాగేష్, ఆరిఫ్, రఘుపతి గిరి, మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, బీఆర్ఎస్ నాయకులు నరసింహారావు, బాబా వెంకటేశ్వర్లు, కిషోర్ బాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్రావుపేటలో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

- డాక్టర్ వేణు సేవలను కొనియాడిన గ్రామస్తులు



**పినపాక,జూలై 16(ప్రజాజ్యోతి)**పినపాక మండలం వెంకట్రావుపేట గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో జానంపేట ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యులు వేణు గ్రామ ప్రజలకు సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు, మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని అన్నారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను మరిన్ని గ్రామాల్లో నిర్వహించి ప్రజలకు సేవలందిస్తామని తెలిపారు.అనంతరం గ్రామానికి విశిష్టవైద్య సేవలు అందించిన డాక్టర్ వేణును గ్రామ సర్పంచ్ సింధూజ,ఉప సర్పం చ్ రవీంద్ర శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమం లో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొని డాక్టర్ వేణు సేవలను కొనియాడారు.

## ఉప ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టు



**కొత్తగూడెం, టౌన్ జూలై 16 ( ప్రజాజ్యోతి )** ఉప ముఖ్యమంత్రి, మంత్రుల జిల్లా పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన చలో మణుగూరు పిలుపు సందర్భంగా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 29వ డివిజన్ కార్పొరేటర్ సాగర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులను 3 టౌన్ పోలీస్ స్టేషన్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ అరెస్టులు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు, ప్రజాస్వామ్య హక్కులైన శాంతియుత నిరసనలను అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. తమ పార్టీ కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు విమర్శించారు. ఈ ఘటనతో కొత్తగూడెంలో రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారగా, పోలీసు బందోబస్తును మరింత కట్టుదిట్టం చేశారు. శివ రుక్మేందర్ శ్రీను రాజేష్ సురేష్ వేముల పవన్. రవి చాగంటి. ఉన్నారు.

## పినపాకలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



**పినపాక,జూలై 16(ప్రజాజ్యోతి )** విద్యాశాఖ–సమగ్ర శిక్ష తెలంగాణ, అలింకో సంయుక్త ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ శిబిరం నిర్వహించినట్లు ఎంపీడీవో సంకీర్త్ తెలిపారు. గురువారం పినపాక మండలం పోతురెడ్డిపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంకీర్త్, మండల విద్యాశాఖ అధికారి కె. నాగయ్య విద్యార్థులకు అవసరమైన సహాయక ఉపకరణాలను పంపిణీ చేశారు. దివ్యాంగ విద్యార్థులు విద్యాభ్యాసంలో మరింత ముందుకు సాగేందుకు ఈ ఉపకరణాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అలింకో ప్రతినిధులు, పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాల ఎంఈఓలు, జెడ్పీహెచ్ఎస్ పినపాక కాంప్లెక్స్ హెచ్ఎం, ఐఆర్పీలు లు, సీఆర్పీలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సంఘటన 3, 4, 5 తేదీల్లో జరిగితే... ఫిర్యాదు 11వ తేదీన ఎందుకు జరిగింది..?

**విశ్వసనీయ సమాచారం ప్రకారం బాధితురాలి తల్లి ఐదో తేదీనే విషయాన్ని పసిగట్టిందా..?**

**ఆమె ఆరో తేదీన ఈ విషయాన్ని మొదట ఎవరితో పంచుకుంది..?**

**6 నుంచి 11వ తేదీ వరకు బాధిత కుటుంబాన్ని పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా ఆపింది ఎవరు..?**

**ఇటు బాధిత కుటుంబాన్ని భయపెడుతూ... అటు నిందితులతో రాజీ ప్రయత్నాలు చేసింది ఎవరు..?**

**రాజీ ప్రయత్నాలు విఫలమైన తర్వాతే స్టేషన్‌కు పంపించారా..?**

**మధ్యవర్తికి నెట్ సెంటర్ అడ్డాగా డీల్ కుదరలేదా..?**

**ఆరు రోజుల వ్యవధిలో జరిగిన ప్రతి పరిణామంపై దర్యాప్తు ఎక్కడ..?**

**మధ్యవర్తి 'సత్యప్రకాశు'డి పాత్రపై సమగ్ర విచారణ ఎందుకు లేదు..?**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి | జూలై 16 | ప్రజా జ్యోతి :** కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జూలై 11న నమోదైన పోక్సో కేసులో ఇప్పుడు అందరి దృష్టి జూలై 5 నుంచి 11వ తేదీ వరకు జరిగిన పరిణామాలపైనే ఉంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం జూలై 3, 4, 5 తేదీల్లో మైనర్ బాలికపై నేరం జరిగినట్లు పేర్కొన్నారు. అయితే విశ్వసనీయ సమాచారం ప్రకారం జూలై 5వ తేదీ రాత్రికే బాధితురాలి తల్లికి అనుమానం వచ్చి, కుమార్తెను ప్రశ్నించగా జరిగిన విషయం తెలిసినట్లు తెలుస్తోంది. అలాంటప్పుడు వెంటనే పోలీసులను ఆశ్రయించకుండా జూలై 11 వరకు ఎందుకు వేచి చూడాల్సి వచ్చింది? అనే ప్రశ్న ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

విశ్వసనీయ సమాచారం ప్రకారం జూలై 6వ తేదీన బాధితురాలి తల్లి ఈ విషయాన్ని రామవరం ప్రాంతానికి చెందిన ఓ నెట్ సెంటర్ నిర్వాహకుడికి చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాలే ఇప్పుడు అనుమానాలకు తావిస్తున్నాయి. స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణల ప్రకారం, "ఈ విషయం బయటకు వస్తే చిన్నారి పరువు పోతుంది... మీ కుటుంబ పరువు కూడా పోతుంది... ఇప్పుడే పోలీస్ స్టేషన్‌కు వెళ్లొద్దు..." అంటూ ఆయన బాధిత కుటుంబాన్ని కొద్ది రోజుల పాటు ఆపినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో వారు వెంటనే పోలీసులను ఆశ్రయించకుండా వేచి చూసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదే సమయంలో మరోవైపు ఆ నెట్ సెంటర్ నిర్వాహకుడు నిందితుల కుటుంబాలతో సంప్రదింపులు జరిపి రాజీకి ప్రయత్నించాడనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. బాధిత కుటుంబానికి ఒక మాట, నిందితుల కుటుంబాలకు మరో మాట చెబుతూ ఈ వ్యవహారాన్ని బయటకు రాకుండా ముగించే ప్రయత్నం చేశాడనే ప్రచారం స్థానికంగా జోరుగా సాగుతోంది. ఈ వ్యవహారంలో డబ్బుల లావాదేవీలకు సంబంధించిన ఆరోపణలు కూడా వినిపిస్తున్నప్పటికీ, వాటిపై ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ లేదు. స్థానికంగా వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, ఆ మధ్యవర్తి 'సత్య ప్రకాశు'డు చేసిన రాజీ ప్రయత్నాలు ఫలించకపోవడంతో చివరకు తిరిగి బాధిత కుటుంబం వద్దకు వెళ్లి, ఇప్పుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడమే మంచిది అని సూచించడంతో వారు జూలై 11న ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. ఒకవేళ ఈ ప్రచారంలో నిజం ఉంటే, జూలై 6 నుంచి 11వ తేదీ వరకు జరిగిన పరిణామాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు ఎందుకు జరగడం లేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలను పోలీసులు తోసిపుచ్చుతున్నారు. "ఇలాంటి విషయాలపై మా వద్ద ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లేవు. కేవలం అనుమానాల ఆధారంగా మేము ముందుకు వెళ్లలేం" అని చెబుతున్నట్లు సమాచారం. అయితే ప్రజలు మాత్రం మరో ప్రశ్న లేవనెత్తుతున్నారు. జూలై 6 నుంచి 11వ తేదీ వరకు సంబంధిత వ్యక్తి ఎవరెవరితో మాట్లాడాడు? బాధిత కుటుంబ సభ్యులతో ఎన్ని సార్లు ఫోన్‌లో మాట్లాడాడు? నిందితులు లేదా వారి కుటుంబ సభ్యులతో ఎలాంటి ఫోన్ సంభాషణలు జరిగాయి? రాజీ ప్రయత్నాలకు సంబంధించిన ఆధారాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ చేయవచ్చు కదా అని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత వ్యక్తి మొబైల్ కాల్ డీటెయిల్ రికార్డులు (సీడీఆర్), లొకేషన్ వివరాలు, కాల్ హిస్టరీ, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి పోక్సో వంటి కేసుల్లో నేరాన్ని దాచిపెట్టేందుకు ప్రయత్నించడం, బాధిత కుటుంబంపై ఒత్తిడి తీసుకురావడం, లేదా రాజీకి ప్రయత్నించారనే ఆరోపణలు వస్తే, ఆ కోణంలో కూడా సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అందువల్ల ఈ కేసులో ప్రధాన నిందితుల పాత్రతో పాటు, జూలై 5 నుంచి 11వ తేదీ వరకు జరిగిన ప్రతి పరిణామాన్ని కూడా నిష్పాక్షికంగా విచారించి ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు సమాధానం చెప్పాలని స్థానికులు కోరుతున్నారు. "ఆరు రోజుల గ్యాప్‌లో అసలేం జరిగింది?" అనే ప్రశ్నకు దర్యాప్తు సంస్థలు స్పష్టమైన సమాధానం ఇస్తేనే ఈ కేసులో నెలకొన్న అనేక సందేహాలకు తెరపడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్




**బూర్గంపహాడ్,జూలై16 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని సీతారామ సాగర్ పంప్ హౌస్ ను సందర్శించేందుకు వస్తున్న రాష్ట్ర మంత్రుల పర్యటనను నిరసిస్తూ అశ్వాపురం బయలుదేరిన బిఆర్ఎస్ నాయకులను బూర్గంపహాడ్ పోలీసులు గురువారం ఉదయం అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు మేరకు అశ్వాపురానికి బయలుదేరిన బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు ముందస్తుగా అడ్డుకొని అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.అరెస్ట్ అయిన వారిలో బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు గోనెల నాని, నాయకులు కొనకంచి శ్రీను,పూర్ణ, కనకా చారి, గుల్ మహమ్మద్, శ్రీను, చైతన్య రెడ్డి, సతీష్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు విషయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ప్రాజెక్టు పరిశీలనకు ఉప ముఖ్యమంత్రి సహా ముగ్గురు మంత్రులు జిల్లాకు వస్తున్న నేపథ్యంలో రైతుల తరఫున ప్రశ్నించాలని పార్టీ పిలుపునిచ్చిన వేళ, ముందస్తుగా బిఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. కోట్లాది రూపాయలు వెచ్చించినప్పటికీ సీతారామ ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో భద్రాద్రి జిల్లా రైతులు సాగునీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా రైతులకు సాగునీరు అందించడం సంతోషకరమైన విషయమేనని, అయితే అదే సమయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులను నిర్లక్ష్యం చేయడం ఎందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు జిల్లా వ్యాప్తంగా చివరి ఎకరం వరకు చేరేలా చర్యలు తీసుకునే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## కోయగూడెం ఓసీపీలో ఐఎన్‌టీయూసీ గేట్ మీటింగ్

**మారుపేర్ల సమస్య పరిష్కారానికి త్వరలో కమిటీ.. సొంతింటి పథకంపై సానుకూల నిర్ణయం వస్తుంది: త్యాగరాజన్**



**టేకులపల్లి, జూలై 16,ప్రజాజ్యోతి:** సింగరేణి కోయగూడెం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు (ఓసీపీ)లో గురువారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. పిట్ సెక్రటరీ కోసూరి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ నాయకత్వంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి కొనసాగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సహకారంతో తాడిచర్ల బ్లాక్–2 సాధ్యమైందని పేర్కొన్నారు.కార్మికుల మారుపేర్ల సమస్య పరిష్కారానికి త్వరలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని, సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సానుకూల ప్రకటన చేసే అవకాశం ఉందని తెలిపారు.ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ జె. వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ గోచికొండ సత్యనారాయణ, డిప్యూటీ జనరల్ సెక్రటరీ భూక్య నాగేశ్వరరావు, మెహబూబ్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉపేందర్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ బాసు, బ్రాంచ్ సెక్రటరీ కాళోజి రాంబాబు, రామకృష్ణ, శ్రీనివాస్, రాము, రాజయ్యతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.




# సింగరేణిలో నేడు మెడికల్ బోర్డు.. కార్మికులకు ఊరట దక్కేనా..?

- దీర్ఘ విరామం తర్వాత మళ్లీ ప్రారంభం కానున్న మెడికల్ బోర్డు
- కార్మిక కుటుంబాల్లో ఉద్యోగాలపై మరోసారి ఆశలు
- గత అనుభవాల నేపథ్యంలో మెడికల్ బోర్డు తీరుపై ఉత్కంఠ
- అన్ఫిట్ శాతంపైనే కార్మికుల్లో ఆసక్తి
- వారసత్వ ఉద్యోగాల అంశం మళ్లీ తెరపైకి
- కార్మిక ప్రాంతాలపై రాజకీయ పార్టీల ఫోకస్
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇదో కీలక పరీక్షగా విశ్లేషణ
- నేటి మెడికల్ బోర్డు ప్రక్రియలో పాల్గొననున్న 120 మంది కార్మికులు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 16, ప్రజా జ్యోతి:** దీర్ఘకాలం తర్వాత సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు 120 మంది కార్మికులతో మెడికల్ బోర్డు ప్రక్రియ నిర్వహించనున్నారు. దీంతో కార్మికుల్లో మరోసారి ఆశలు చిగురిస్తున్నాయి. గత కొంతకాలంగా మెడికల్ బోర్డు ప్రక్రియ నిలిచిపోవడంతో ఉద్యోగుల కుటుంబాల్లో అసంతృప్తి నెలకొంది. ఇప్పుడు మళ్లీ ఈ ప్రక్రియ ప్రారంభం కావడంతో ఈసారి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు..? కార్మికులకు ఎంత మేర ఊరట లభిస్తుంది..? అనే అంశాలు చర్చనీయాంశంగా మారాయి. ఈసారి మెడికల్ బోర్డు ఫలితాలు కార్మికుల్లో ప్రభుత్వంపై ఉన్న అభిప్రాయాన్ని కూడా ప్రభావితం చేసే అవకాశముందని కార్మిక వర్గాల్లో చర్చ సాగుతోంది.

### మెడికల్ బోర్డుపై కార్మికుల దృష్టి..

సింగరేణిలో మెడికల్ బోర్డు కేవలం వైద్య పరీక్షల ప్రక్రియ మాత్రమే కాదు. అనేక కార్మిక కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న కీలక వ్యవస్థగా భావిస్తారు. ఆరోగ్య పరిస్థితుల ఆధారంగా ఉద్యోగి అన్ఫిట్ గా ప్రకటించబడితే, అమల్లో ఉన్న నిబంధనలకు అనుగుణంగా వారసత్వ ఉద్యోగానికి అవకాశం ఉండటంతో ఈ ప్రక్రియపై కార్మిక కుటుంబాలు ప్రత్యేక ఆసక్తి చూపుతుంటాయి. గత ప్రభుత్వంలో నిర్వహించిన మెడికల్ బోర్డుల్లో ఎక్కువ సంఖ్యలో అన్ఫిట్ లు ప్రకటించడం వల్ల అనేక కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు లభించాయని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. అయితే ఇటీవల నిర్వహించిన బోర్డుల్లో ఎక్కువ మంది ఉద్యోగులను ఫిట్ గా ప్రకటించడం వల్ల అర్హులైన కుటుంబాలకు అవకాశాలు తగ్గిపోయాయని కొన్ని కార్మిక సంఘాలు, ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశమే కార్మికుల్లో ప్రస్తుతానికి కాంగ్రెస్ పై కొంత అసంతృప్తికి కారణమైందని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నేడు నిర్వహించే మెడికల్ బోర్డుపై ఉత్కంఠ నెలకొంది. నేడు వైద్య పరీక్షలు నిర్వహించి, రేపు ఫిట్, అన్ఫిట్ లపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈసారి పారదర్శకంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటారా..? గతంలో వచ్చిన విమర్శలకు ముగింపు పలుకుతారా..? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అర్హులైన వారికి న్యాయం జరిగేలా నిర్ణయాలు ఉంటే కార్మిక కుటుంబాలకు గణనీయమైన ఊరట లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### రాజకీయంగా కూడా కీలక అంశమే..

సింగరేణి కార్మిక ప్రాంతాల్లో మెడికల్ బోర్డు ఎప్పుడూ రాజకీయ చర్చకు దారి తీసే అంశమే. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తో పాటు ఇతర రాజకీయ పార్టీలు కూడా కార్మిక సంక్షేమ అంశాలపై దృష్టి సారిస్తున్నాయి. ముఖ్యంగా వారసత్వ ఉద్యోగాల అంశం కార్మిక కుటుంబాలకు కీలకంగా ఉండటంతో ఈ నిర్ణయాల ప్రభావం రాజకీయంగానూ కనిపించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పలుమార్లు ప్రకటించింది. అయితే మెడికల్ బోర్డు నిర్వహణలో ఆశించిన స్థాయిలో అర్హులైన వారికి అవకాశాలు లభించడం లేదనే అభిప్రాయం కార్మిక వర్గాల్లో వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో నేటి మెడికల్ బోర్డు ఫలితాలు కార్మికుల్లో ప్రభుత్వంపై సానుకూల సంకేతాలు పంపుతాయా..? లేక గత విమర్శలే కొనసాగుతాయా..? అనే అంశంపై ఆసక్తి నెలకొంది. అర్హులైన కార్మికుల ఆరోగ్య పరిస్థితిని నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటే కార్మిక కుటుంబాల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు గతంలో వచ్చిన విమర్శలు మళ్లీ పునరావృతమైతే అసంతృప్తి కొనసాగవచ్చని కూడా భావిస్తున్నారు.

### కార్మిక సంఘాల ఆశలన్నీ ఈ బోర్డుపైనే..

దీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న ఈ మెడికల్ బోర్డుపై కార్మిక సంఘాలు కూడా ఆశలు పెట్టుకున్నాయి. మెడికల్ బోర్డు నిర్వహణ సరిగా జరగగలిగితేనే సంఘ నాయకులు కూడా కార్మికులలో కొంచెం యాక్టివ్ అవ్వగలరు. దీంతో మెడికల్ బోర్డు పూర్తిగా వైద్య ప్రమాణాలు, అమల్లో ఉన్న నిబంధనల ప్రకారమే నిర్వహించాలని, అర్హులైన ప్రతి కార్మికుడికి న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలని వారు కోరుతున్నాయి. అలా జరిగితేనే కార్మికుల్లో విశ్వాసం పెరగడంతో పాటు కార్మిక కుటుంబాలకు ఊరట లభిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. చాలా గ్యాప్ తర్వాత జరుగుతున్న మెడికల్ బోర్డు కావడంతో సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలు, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు నేటి పరిణామాలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఈ మెడికల్ బోర్డు ఫలితాలు ఎంతమందికి ఊరటనిస్తాయి..? కార్మిక వర్గంలో ఎలాంటి స్పందన కనిపిస్తుంది..? ప్రభుత్వం, యాజమాన్యం తీసుకునే నిర్ణయాలు కార్మికుల్లో ఎలాంటి సంకేతాలను పంపుతాయి..? అనే అంశాలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి.

# ఆరో నిందితుడిపై మౌనం ఎందుకు..?

(మొదటి పేజీ తరువాయి...)

పూర్తి వివరాలు ఇవ్వగా, ఐదో నిందితుడికి పరిమిత వివరాలు మాత్రమే ఇచ్చారు. ఆరో నిందితుడి విషయంలో మాత్రం ఇంటిపేరు కూడా పేర్కొనకుండా పేరు, మండలంతోనే సరిపెట్టడం చర్చనీయాంశమైంది. పోలీసు శాఖలో పనిచేస్తున్న వ్యక్తి కావడం వల్లే పూర్తి వివరాలు వెల్లడించలేదా? లేక దర్యాప్తు ప్రయోజనాల దృష్ట్యా అలా చేశారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సాధారణంగా సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకొచ్చే సామర్థ్యం పోలీసు శాఖకు ఉందనే పేరు ఉంది. అలాంటప్పుడు ఎఫ్ఐఆర్‌లో పేరు నమోదు చేసిన ఆరో నిందితుడు ఇప్పటికీ పోలీసులకు చిక్కకపోవడం వెనుక కారణమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అదే వేగంతో మిగిలిన ఇద్దరు నిందితులను కూడా అరెస్టు చేసి దర్యాప్తు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. అయితే ఇందులో భాగంగా మరో పుకారు ఇక్కడ చెక్కర్లు కొడుతుంది. ఈ కేసుకు సంబంధించిన కానిస్టేబుల్‌ను కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం జోరుగా వినిపిస్తోంది. అతనిపై సాధారణ సెక్షన్లే నమోదు చేసి ఘోరమైన కేసు నుండి కొంత వెసులుబాటు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పలువురు గుసగుసలాడుతున్నారు. ఈ ఆరోపణలో ఎలాంటి నిజం లేకున్నా ప్రస్తుతం మాత్రం ఇది కొత్తగూడెం వ్యాప్తంగా చర్చగా మారింది. దాంతోపాటు ఆయన ఏఆర్ కానిస్టేబులా, టీజీఎస్పీ కానిస్టేబులా, ప్రస్తుతం విధుల్లో ఉన్నారా, ఆయనపై శాఖాపరమైన చర్యలు ప్రారంభించారా అనే అంశాలపై కూడా పోలీసులు ఇప్పటివరకు పూర్తి స్పష్టత ఇవ్వకపోవడంతో ఈ పుకారుపై అనుమానం మరింతగా ముదురుతుంది. అయితే విశ్వసనీయ సమాచారం ప్రకారం, గురువారం సాయంత్రం సంబంధిత కానిస్టేబుల్ అంశంపై చర్చించేందుకు పోలీసు శాఖకు చెందిన కొందరు ఉన్నతాధికారులు కొత్తగూడెంలోని ఓ అధికారిక కార్యాలయంలో సమావేశమైనట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో ఏ అంశాలపై చర్చ జరిగింది? సంబంధిత కానిస్టేబుల్‌పై చట్టపరమైన, శాఖాపరమైన చర్యల గురించేనా? లేక దర్యాప్తు పురోగతిపైనా? అనే విషయాలపై అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడికాలేదు. అయితే ఈ కేసుకు సంబంధించి ఉన్నతాధికారుల స్థాయిలో సమావేశం జరిగినట్లు సమాచారం రావడం గమనార్హంగా మారింది. చట్టం ముందు అందరూ సమానమేనని చెబుతున్న పోలీసు శాఖ, ఈ కేసులో కూడా అదే సూత్రాన్ని అమలు చేస్తుందా? ఎఫ్ఐఆర్‌లో పేరు ఉన్న ఆరో నిందితుడిని ఎప్పుడు అరెస్టు చేస్తుంది? ఆయనపై ఎలాంటి చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకుంటుంది? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. పోలీసులు ఇప్పటికే నలుగురు నిందితులను వేగంగా అరెస్టు చేసి దర్యాప్తులో పురోగతి సాధించిన నేపథ్యంలో, మిగిలిన ఇద్దరు నిందితులను కూడా త్వరగా అదుపులోకి తీసుకుని, ఈ కేసుకు సంబంధించిన అన్ని అనుమానాలకు పూర్తి స్థాయిలో తెరదించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఆరో నిందితుడి పాత్ర, ఆయనపై తీసుకుంటున్న చర్యలు, దర్యాప్తు పురోగతిపై పోలీసులు స్పష్టత ఇస్తేనే ప్రస్తుతం వ్యక్తమవుతున్న సందేహాలు తొలగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

# ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన

### వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి(ఏఈఓ) అరుణ




**ఆళ్ళపల్లి. జూలై 16. (ప్రజాజ్యోతి)** ఆళ్లపల్లి మండలంలోని పాతూరు, జిన్నెలగూడెం, మర్కోడు గ్రామాల్లో ఎల్ నినో ప్రభావంతో రానున్న రోజుల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని సూచించారు. వరి సాగుకు అనుకూల పరిస్థితులు లేకపోతే ప్రత్యామ్నాయంగా పెసర, మినుము, బొబ్బర వంటి తక్కువ నీటి అవసరమయ్యే పంటలను సాగు చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) అరుణ రైతులకు వివరించారు. వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో మర్కోడు గ్రామ సర్పంచ్ సుతారి రమాదేవి పాల్గొని రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటించి శాస్త్రీయ విధానాలతో సాగు చేపట్టాలని కోరారు. రైతులు పంటల ఎంపిక, వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు.